క్లుప్తంగా

ఘనంగా గౌరీ శంకరుల మహోత్సవం



గౌరీ శంకరుల మహోత్సవంలో పాల్గొన్న స్థానిక మహిళా భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక 42వ డివిజన్‌లోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి, జానకి రామాంజనేయ, గౌరీ శంకర, సాయి మందిరంలో గౌరీ దేవి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు, మహిళ భక్త బృందం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నగర పొలిమేరల్లోని వరి పొలం వద్దకు వెళ్లి గౌరీ దేవికి ప్రతీకగా వరి దుబ్బులను మేళ తాళాలతో, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి నామస్మరణతో నగర వీధుల్లో పాదయాత్ర చేసుకుంటూ అత్తగారి ఇంటి నుంచి పుట్టింటికి చేర్చారు. సాయంత్రం పుట్టింటి నుంచి మెట్టినింటికి ట్రాక్టర్‌పై నగర వీధులలో అమ్మవారి, స్వామి వారి నామస్మరణలతో, భాజా భజంత్రీలతో, విద్యుత్ అలంకరణ, వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి ఆలయానికి చేర్చారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.

మైభారత్‌లో భాగస్వాములు కావాలి



మైభారత్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు రూరల్ : మైభారత్ కార్యక్రమంలో దేశ ప్రజలను సేవా కార్యక్రమాలకు పురిగొలిపేందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నెహ్రూ యువకేంద్రం అధికారి దూలం కిషోర్ అన్నారు. సోమవారం ఏలూరులో నిర్వహించిన మైభారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మైభారత్‌లో దేశ వ్యాప్తంగా ప్రముఖులు పాల్గొని సమాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. జిల్లాలో మూడురోజుల పాటు ఎన్‌వైకే చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రుల పరిశుభ్రత, రైతుబజార్ల పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, యువతీ, యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. తొలుత నగర కార్పొరేషన్ శానటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఏడుకొండలు, ఆఫీసర్ సుధాకర్, సెయింట్ ఆన్స్ కాలేజీ, ఏలూరు విన్సెంట్ డీపాల్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఎన్‌వైకే వాలంటీర్లు పత్తేబాద్ రైతు బజారులో చెత్త సేకరించారు.

బాప్టిస్ట్ పేట.. సమస్యల తిష్ట

- రోడ్డుపైకి లీకవుతున్న పంపుల చెరువు వాటర్
- ప్రమాదాలు జరిగినా పట్టించుకోని అధికారులు
- కంపు కొడుతున్న డ్రెయిన్లు
- అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో స్పీడు బ్రేకర్లు వేయాలని కోరుతున్న స్థానికులు

ఏలూరు (టూటౌన్): నగర కార్పొరేషన్ పరిధిలోని అన్ని కాలనీలు, పేటలు సమస్యలతో సతమతమవుతున్నాయి. రోడ్డు ఉంటే డ్రెయిన్ ఉండదు, రెండూ ఉంటే కనీస సౌకర్యాలు కరువు. 18వ డివిజన్‌లోని బాప్టిస్ట్‌పేట, గొల్లాయగూడెం ప్రాంతాల్లో స్థానికులను పలు సమస్యలు వేధిస్తున్నాయి. డ్రెయిన్లలో పూడిక పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా స్థానికులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఏర్పడింది. సమస్యలను పరిష్కరించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు తమ ప్రాంతాన్ని పట్టించుకునే పాపాన పోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

రోడ్డుపై నిలుస్తున్న నీరు

స్థానిక పంపుల చెరువులోని నీరు లీకై సమీపంలోని తారు రోడ్డుపైకి చేరుతుంది. ఆ ప్రాంతమంతా చిత్తడి చిత్తడిగా మారి గోతులు ఏర్పడడంతో రాకపోకల సమయంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళ రాకపోకలు మరీ ప్రమాదకరంగా మారాయి. వాహనచోదకులు నీరే కదా అని బండి పోనిచ్చి గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు.

సిల్ట్ తొలగింపుపై నిర్లక్ష్యం

బాప్టిస్ట్‌పేటను ఆనుకుని గతంలో పంట కాలువ ఉండేది. అది క్రమేణా ఆక్రమణలకు గురైంది. పంట కాలువ కాస్తా డ్రెయినేజీగా స్థానికులు వినియోగిస్తున్నారు. ఈ డ్రెయిన్ నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో డ్రెయిన్‌లో సిల్ట్ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులు తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలి

బాప్టిస్ట్‌పేటలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి లోపలికి పలు కాలనీలకు వెళ్లే మార్గం నిత్యం అధిక రద్దీ ఉంటుంది. ఈ ఇరుకు రోడ్డులో ద్విచక్ర వాహనచోదకులు అతి వేగంగా రాకపోకలు కొనసాగించడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎప్పుడు చిన్నపిల్లలు, వృద్ధులు వాహనాల క్రింద పడుతారో అని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. తక్షణం ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



పంపుల చెరువు గట్టు రోడ్డు నుంచి బాప్టిస్ట్‌పేట వెళ్లే ప్రధాన రహదారిలో లీకవుతున్న నీరు



స్పీడు బ్రేకర్‌లు వేయాలని ప్రజలు కోరుతున్న బాప్టిస్ట్‌పేట అంబేడ్కర్ సెంటర్ ఇదే..



డ్రెయిన్‌గా మారిన పంట కాలువ

డ్రెయినేజీ నిర్మించాలి



పంపుల చెరువు నీరు లీకై రోడ్డుపై నిలుస్తుండటంతో గోతులు ఏర్పడ్డాయి. రాత్రి వేళల్లో గోతుల్లో పడి వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. మరో వైపు రోడ్డుపై ఒక వైపు నీరు నిలిచి ఉండటంతో పగలు వాహనదారులు రెండో వైపు నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాలు వేగంగా వెళ్లడతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తక్షణం పంపుల చెరువు గట్టు గోడను ఆనుకుని పక్కా డ్రెయినేజీ నిర్మించాలి. – బొల్లారపు నాగరాజు, స్థానికుడు, బాప్టిస్ట్‌పేట, 18వ డివిజన్, ఏలూరు

ట్రాఫిక్ సమస్య



గొల్లాయిగూడెం పంపుల చెరువు రోడ్డు గొల్లయిగూడెం రాజీవ్‌గృహకల్ప కాలనీ, సన్ సిటీ, హనుమాన్ నగర్, ఎన్టీఆర్ కాలనీ, రామకృష్ణాపురం, మినీ బైపాస్, కాలిబాట వంతెనపై రాకపోకలు కారణంగా మా ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు తక్షణం అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో స్పీడు బ్రేకర్‌లు నిర్మించాలి. – టి.రాజేష్, స్థానికుడు, బాప్టిస్ట్‌పేట, 18వ డివిజన్, ఏలూరు

డ్రెయిన్లలో పూడిక తీయాలి



మా ప్రాంతంలోని డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తక్షణం తొలగించాలి. డ్రెయినేజీల్లో నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో డ్రెయినేజీల వద్ద ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్రెయినేజీలను ఆనుకుని నివశించే ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. డ్రెయినేజీల్లో పూడిక తీసేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టాలి. – తోట జాన్ విల్సన్, స్థానికుడు, గొల్లాయిగూడెం, 18వ డివిజన్

బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా కన్వీనర్ జె.దుర్గాప్రసాద్, కో కన్వీనర్ సీహెచ్ సూర్యచక్రవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశిత ప్రొఫార్మాలో దరఖాస్తుల తోపాటు అన్ని కాపీలను జతచేసిన నవంబరు 11లోగా సంచాలకులు, బాలల సంక్షేమం, సంస్కరణ సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ, విజయవాడ కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాలకు ఏలూరు జిల్లా కన్వీనర్ జె.దుర్గాప్రసాద్, జిల్లా పర్యవేక్షణ అధికారి ఫోన్ నెంబర్ 91000 45424, కో కన్వీనర్ సీహెచ్ సూర్య చక్రవేణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఫోన్ నెంబర్ 79015 97267లో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

ఏలూరు నుంచి ఆశ్రం ఉచిత బస్సు



ఆశ్రం ఉచిత బస్సు ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : ఏలూరు నగర ప్రజల సౌకర్యార్థం ఉచిత బస్సు నడుపుతున్నట్టు ఆశ్రం సీఈఓ కె.హనుమంతురావు తెలిపారు. సోమవారం తంగెళ్లమూడి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటుచేసిన ఉచిత బస్సును ఎమ్మెల్యే బడేటి చంటి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు పెట్రోల్ బంక్ వద్ద నుంచి బస్సు ప్రారంభమౌతుందన్నారు. అశోక్‌నగర్, పెద్దాసుపత్రి, ఫైర్‌స్టేషన్, జూట్ మిల్లు మీదుగా పాతబస్టాండ్ మీదగా ఆశ్రం ఆసుపత్రికి చేరుతుందన్నారు. మధ్యాహ్నం 1 గంటకు ఆశ్రం నుంచి తిరుగు ప్రయాణమై తంగెళ్లమూడికు చేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీ వైష్ణవి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించాలి



ఫిర్యాదు చేయడానికి వచ్చిన విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని ఎస్‌వీఆర్‌కే, శ్రీ వైష్ణవి విద్యాసంస్థల్లో దూరవిద్య ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇప్పించాలని కోరుతూ కొందరు విద్యార్థులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రోజు రోజుకీ ఎస్‌వీఆర్‌కే, శ్రీ వైష్ణవి విద్యాసంస్థల కరస్పాండెంట్ మురళీమోహన్ ఆగడాలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. 2020 – 2021 సంవత్సరంలో దూరవిద్యా విధానంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన కరణం రామసత్య నూకరాజు, ఇల్లపు దుర్గారావు అనే విద్యార్థుల నుంచి రూ.8 వేలు చొప్పున వసూలు చేసి వారికి ఇప్పటికీ విద్యార్థికి సర్టిఫికెట్ ఇవ్వలేదని తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ డిస్టెన్స్‌లో డిగ్రీ కట్టిన క్రాంతి లతా అనే విద్యార్థినితో పరీక్ష రాయించకుండా మూడేళ్లు గడిపి రూ.4 వేలు కట్టించుకుని కాలయాపన చేస్తున్నారని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడుతున్న శ్రీ వైష్ణవి విద్యాసంస్థల గుర్తింపు రద్దుచేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, నగర అధ్యక్షుడు ఎం క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని యూనియన్ (ఆంధ్రాబ్యాంక్) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ యువతీ యువకులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వడానికి ఏర్పాటు చేశామని ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ నవంబర్ 4వ తేదీ నుంచి ప్రాంభిస్తామని, శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. 19 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు కలిగిన గ్రామీణ యువతీ యువకులు అర్హులని, ఫోన్ నెంబర్లు 95027 23561, 90140 40780, 95330 79471లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

ఏలూరు రూరల్ : రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెరగాలని ఆశ్రం సీఈఓ హనుమంతురావు ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం రొమ్ము క్యాన్సర్ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో వైద్య విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక అవగాహనతో క్యాన్సర్‌పై పోరాటం సులువన్నారు. ప్రతి ఒక్కరూ క్యాన్సర్ గూర్చి ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆశ్రం వైద్యులు, పారామెడికల్ కాలేజీ విద్యార్థులు, తదితరులు పింక్ రిబ్బన్ ఆకారంలో మానవహారం ఏర్పాటుచేసారు.

నైపుణ్య గణనపై శిక్షణ

ఏలూరు(మెట్రో) : నవంబర్ మొదటి వారం నుంచి జిల్లాలో నైపుణ్య గణన చేపడుతున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి సోమవరం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ఉదయం 10:30 గంటలకు సెయింట్ జేవియర్స్ స్కూల్ ఎదురుగా ఉన్న జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్, ఏలూరులో జిల్లా స్థాయి శిక్షణ ఏర్పాటు చేసినట్లు, దీని కోసం మాస్టర్ ట్రైనర్ల ఎంపిక ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న 15 నుండి 59 మధ్య వయసు ఉన్న నైపుణ్యం గల వ్యక్తుల వివరాలు సేకరించి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

8 నుంచి ప్రజాపోరు యాత్రలు



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామ్

ఏలూరు (టూటౌన్): నవంబర్ 8 నుంచి 15వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాపోరు యాత్రల ప్రచారోద్యమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. స్థానిక పవరుపేటలో గల సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా కమిటీ సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సీతారాం మాట్లాడుతూ జిల్లాలో నవంబరు 8 నుంచి 14 వరకు ప్రజాపోరు పేరుతో ఇంటింటికీ ప్రచారం, 15న అన్ని తహసీల్దార్, మున్సిపల్ ఆఫీసుల వద్ద ధర్నాలు చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక చర్యలను ఖండిస్తామని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుకను అమలు చేయాలని, మద్యం పాలసీ విషయంలో ప్రభుత్వం సరైన ప్రణాళికను రూపొందించాలని కోరారు. సమావేశంలో నాయకులు డీఎన్ వీడీ ప్రసాద్, ఆర్ లింగరాజు, పి.కిషోర్, ఎం నాగమణి, జి.రాజు, గుడిపాటి నరసింహారావు, పి.రామకృష్ణ, ఎం జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, కె.శ్రీనివాస్, పి.మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి



వినతి పత్రం చూపుతున్న రైతులు, రాంప్రసాద్

ఏలూరు (టూటౌన్): పోలవరం నియోజకవర్గం కొత్త పట్టిసీమ రైతులకు ధాన్యం బకాయిలను చెల్లించాలని కోరుతూ బాధిత రైతులు బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ ప్రతాప్‌కిషోర్‌లకు వినతి పత్రం అందజేశారు. 2023 జనవరి ఏడో తేదీన 11 మంది రైతులు మాదేపల్లి యోగేశ్వరరావుకు ఆఫ్‌లైన్‌లో రూ.15,04,448 విలువగల ధాన్యాన్ని తోలగా, నేటికీ ఆ రైతులకు సొమ్ము చెల్లించలేదని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నీట మునిగిన ధాన్యాన్ని ఆన్‌లైన్లో కొనాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కీర్తి రాంప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీకృష్ణదేవరాయలు, గణపతి, కొత్త పట్టిసం రైతులు వీరపురాజు ధర్మరాజు, వీరపరాజు వీర రాఘవులు, అందే రాంబాబు, కొంచ గోవిందరాజు, మల్లి గరటయ్య, తిరపరపు రమణ,బిక్కవోలు సాయి,పట్టపగలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	49
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	20

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36-40	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	76	చిక్కుడు కాయలు	00
వంకాయలు (కాంతులు)	40-72	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	58	ములక్కాడలు	07,10
బెండకాయలు	52-56	కంద	60
పచ్చిమిర్చి	40-48	బీట్‌రూట్	40-50
కాకర కాయలు	46-54	కీరా దోస	36
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	54	అల్లం	80
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	50-60	పాలకూర	15
దొండకాయలు	36-40	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	40,48,55	గోంగూర	07
గోరుచిక్కుడు	50	పుదీనా	05
దోసకాయలు	40-48	బఠాణీ	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	84-96
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

డ్రెయిన్ ఆక్రమణలు తొలగించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: మండలంలోని ముప్పవరంలో ఆక్రమణకు గురైన ఇరిగేషన్ డ్రెయిన్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి దెందులూరు తహసీల్దార్ బి. సుమతిని ఆదేశించారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో మీకోసం కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తహసీల్దార్‌తో మాట్లాడారు. ఈ సమస్యను పరిష్కరించకుండా క్లోజ్ చేస్తే మెమోలిస్తామన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనచేసి వెంటనే ఆక్రమణ తొలగించి ప్రజాప్రయోజనంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ముప్పవరం వెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఇన్‌ఛార్జి ఎంపీడీవో భీమరాజు, జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు అధికారులు తూతూమంత్రంగా హాజరయ్యారు.

కవ్వగుంటలో ఓ వర్గంపై దాడి



బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

- రోడ్డుపై బైఠాయింపు
- సీఐ హామీతో సమస్య పరిష్కారం

పెదవేగి : ఇతర జిల్లా నుంచి వచ్చి స్థానికంగా నివాసం ఏర్పరచుకొని జీవిస్తుంటే సహించలేని కొందరు మీరు స్థానికులే కాదంటూ ఒక వర్గంపై దాడి చేసిన ఘటన ఏలూరు జిల్లాలో పెదవేగి మండలం కవ్వగుంటలో చోటుచేసుకుంది. స్థానికులు కాదంటూ ఒక వర్గం మరో వర్గంపై దాడి చేసిన ఘటన తీవ్ర వివాదానికి దారితీసింది. దీనిపై ఆగ్రహించిన ఓ వర్గం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతానికి చెందిన కొంత మంది ఏళ్ల కాలంగా కవ్వగుంట గ్రామంలో నివసిస్తున్నారు. కొంతమంది స్థానికులు వారిపై దాడులకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం దాడి మహేష్, దాడి సన్యాసినాయుడు, ఆబోతుల సురేష్‌పై మరో సామాజిక వర్గానికి చెందిన బెజవాడ సుబ్బారావు అనే వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. దీంతో దాడి జరిగిన విషయాన్ని స్థానిక నాయకులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో వారు పెదవేగి పోలీసులకు సమాచారం అందించారు. అయినా స్పందన లేకపోవడంతో బాధితులంతా ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన బాధితులు వంగూరు, కవ్వగుంట, జగన్నాథపురం ప్రధాన రహదారిపై టెంట్ వేసి, గంటల తరబడి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. చివరకు పెదవేగి సర్కిల్ సీఐ కె వెంకటేశ్వరరావు వచ్చి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వగా, ఎస్సై కె రామకృష్ణ తన సిబ్బందితో టెంట్‌ను తొలగించి పరిస్థితి చక్కబరిచారు. ఈ ఘటనలో దాడి మహేష్ ఫిర్యాదు మేరకు నాగసాయి, బెజవాడ క్రాంతి మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభినందనలు



ఏపీఎన్‌జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులను కలిసిన నర్సింగ్ అసోసియేషన్ సభ్యులు

ఏలూరు(మెట్రో): రాష్ట్ర నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి చేసిన అందరికీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీఎన్‌జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావులు అభినందనలు తెలిపారు. సోమవారం ఏలూరు ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో రాష్ట్ర నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ఎన్నికైన దయావతమ్మ, బేబీ ఉమలు జిల్లా ఏపీఎన్‌జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, రామారావులు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి నుంచి ఎం దయావతమ్మ (హెడ్ నర్స్, జీజీహెచ్, ఏలూరు) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, నల్లమిల్లి బేబీఉమ (హెడ్ నర్స్, పోలవరం, ఏరియా హాస్పిటల్) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబెర్‌గా ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నర్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం లీలారాణి, రూత్ రికెట్స్, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

చెట్లు పెంచుకునే అవకాశం కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న కుంచే వసంతరావు

చింతలపూడి: వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా చెట్లు పెంచుకునే అవకాశం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు ముల్లగిరి లాజరు అధ్యక్షతన నిర్వహించారు. వసంతరావు మాట్లాడుతూ వన సంరక్షణ సమితులు 1996లో ఏర్పాటు చేశారని, నాటి నుంచి అడవి భూముల్లో ఫారెస్ట్ అధికారులు వీఎస్ఎస్ సభ్యులు ఉమ్మడి యాజమాన్యం పద్ధతిలో మొక్కలు వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సరైన సమయంలో మొక్కలు ఇవ్వకపోవడం వల్ల, వేసిన మొక్కలు పెరగక వాటిపై శ్రద్ధ లేదని, ఈ నేపథ్యంలో వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా మొక్కలు పెంచుకునే అవకాశం కల్పించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఫారెస్ట్ అధికారులు వన సంరక్షణ సమితిలో జామాయిల్ వేసారని, అవి నరకడం లేదని, అవి పెద్దపెద్ద చెట్లయితే పనికి రాకుండా పోతున్నాయని తెలిపారు. రేచర్ల వీఎస్ఎస్‌లో జామాయిల్ నరకడం కోసం ఇప్పటికి మూడుసార్లు నెంబర్ ఇచ్చారని, నరకడానికి పర్మిషన్ ఇవ్వాలని ఫారెస్ట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు బోడ వజ్రం, మండల కార్యదర్శి ఇస్తరాకులు వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు ముల్లగిరి అలెగ్జాండర్, పార్టీ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.